ప్రాశావద కవిగ్రామణి"
కవిగారికి యీ సమస్య
మెదడున ఘనీభవించెను."

ఇంతటితో నా కలం ఆగిపోయింది. సిరా లోకి పాళీ జారిపోయింది. చలికి సిరా గడ్డ కట్టుకుపోయింది. నా చేతులూ వణుకుతున్నై. ఇహ నా గేయం ముందుకు జరిగేదలా? ఇంతలో యేదో అంతర్వాణి గొడ్డుకేక పెట్టినట్లయింది.

మా యిద్దరికీ యీ విధంగా సంభాషణ కొంతదూరం నడిచింది.

నేను ప్రశ్నించాను. "నాకు అంతర్జాతీయ కీర్తి రావడమెలాగ?"

"సిరాని కరిగించి, పాళీతీసి కలానికిపెట్టి తిరిగి నీ గేయం పూర్తిచేసి శాంతి మహాసభకు పంపిస్తే—ఎట్ లీస్ట్ నీకు నోబుల్ ప్రైజ్ ఐనా వచ్చి తీరుతుంది" అని చెప్పి అంతర్వాణి మాయమైపోయింది. వెంటనే సిరాలోకి జారిన పాళీని యివతలికి తీయడానికి ఘోరసన్నాహాలు ప్రారంభించాను. సిరా బుడ్డి కుదిపి చూసేను. లోపల సిరా ఐసు ముక్కలా గడ్డ కట్టేసింది. ఆ లోపల పాళీ చిక్కడిపోయింది. నాకు అంతర్జాతీయ కీర్తి రావడం ఆలస్యమైపోతోంది. వెంటనే సిరాబుడ్డిని 'ధన్' మని నేలకేసి కొట్టాను. నా కీర్తి చల్లారక, నా క్రోధజ్వాలల కాహుతైన సిరా బుడ్డి చిద్రుప చిద్రుపలైంది. పేలిపోయిన అగ్నిపర్వతంలోంచి లావా ప్రవహించినట్టు సిరా కరిగిపోయి ప్రవహించడం ప్రారంభించింది. పాళీ యే మూలకో పారిపోయింది.

ఇహ నా గేయం జరగడం యెల్లాగ?
నా కంతర్జాతీయకీర్తి రావడం యెలాగ?
నా కీర్తి దాహం చల్లారడ మెల్లాగ?
నా ఆశలు అవకాశంలోనే నిల్చిపోయి_
(నేను—కీర్తికాముకుడు).

# ఆకులు రాలే కాలం

"హితశ్రీ"

రాత్రి తొమ్మిదిన్నరకి తలుపు నెమ్మదిగా తోసుకుని లోపల ప్రవేశించాడు రామచంద్రరావు. గదంతా చీకటిగా ఉంది. ఎదురుగా ఉన్న మేడలోంచి విద్యుద్దీప కాంతి ఆవరణలోని బాదంచెట్టు ఆకుల తెరలు సాధ్యమైనంతవరకు తప్పించుకుని కిటికీగుండా ప్రసరిస్తూ, మంచంమీద నిద్రపోతున్న వసంత ప్రశాంత ముఖాన్ని పరిశీలిస్తోంది. ఆ కొస్త వెలుగులో, గదిలో వస్తువులు నీడల్లా కనబడుతున్నాయి. కాని రామచంద్రరావు నుంచున్న చోటునించి కదలలేదు. అతను తదేక దీక్షగా వసంత ముఖంవైపు చూస్తున్నాడు. ఆవరించిన చీకటిలో ఆ కొస్త వెలుగువైపూ అతను ఆలోచనా రహితంగా అలాగే చూస్తూ నిలబడ్డాడు. గాలికి కిటికీ రెక్క కొట్టుకుంది. వసంత ఉలిక్కిపడి లేచింది. తనకి తెలియకుండానే రామచంద్రరావు బరువుగా నిట్టూర్పు విడిచాడు. ఆ చప్పుడికి వసంత తలెత్తి తలుపువైపు చూసింది. అతను ముందుకి నడిచాడు.

"ఎంతసేపైంది వొచ్చి?"

"ఇప్పుడే."

వసంత లేచి లాంతరు వెలిగించింది. రామచంద్రరావు మంచంమీద కూలబడ్డాడు. ఆమె లోపలికి వెడుతుంటం చూసి అన్నాడతను.

"ఇప్పుడాకలి లేదులే."

"ఏం?" ఆశ్చర్యంగా అడిగిందామె.

రామచంద్రరావు జవాబు చెప్పలేదు. జేబులోంచి కొన్ని నోట్లు తీసి ఆమెకిస్తూ అన్నాడు.

"అలమారులో పడెయ్యి."

వసంత నోట్లవైపు ఆశ్చర్యంగా చూసింది. ఇంకా పదో తారీకైనా రాకుండా ఇప్పుడీ డబ్బెక్కడిది? బహుశా అప్పు తెచ్చారేమో. ననుకొని నోట్లను అందుకుంటూ అడిగింది మాటవరసగా.

"ఎక్కడిది?"

"జీతం."

సాశ్చర్యంగా చూసింది వసంత.

"ఇప్పుడేం జీతం?"

"ఉద్యోగం మానేశాను. కాదు, తీసేశారు."

"ఎందుకు?" హీనస్వరంతో అడిగిందామె.

"విశ్వాసఘాతకుడికెఉద్యోగం ఎవరిస్తారు?"

ఈ మాటలోని వ్యంగ్యం, రౌద్రం చూసి వసంత కాసేపాగి, నెమ్మదిగా అడిగింది.

"ఏం జరిగింది?"

రామచంద్రరావు జవాబు చెప్పలేదు. కొద్ది క్షణాలతరవాత అకస్మాత్తుగా అడిగాడతను.

"మనం రూపాయికి ఎన్నిబియ్యం కొంటున్నాం?"

"ఇప్పు డీప్రశ్న అడగటానికి కారణమేమిటో ఆమెకేమీ అర్థం కాకపోయినా, అడ్డుప్రశ్న వెయ్యక సూటిగా జవాబు చెప్పింది వసంత.

"తలకొట్టి తవ్వెడు."

"హుం. ఎందుకో తెలుసా?"

"అంతకంటె ఎక్కువ ఇవ్వరు గనకా, తిండి లేకపోతే బతకం గనకా."

"అంతకంటె ఎక్కువ ఇవ్వక పోవటానికి కారణం ఎవరో తెలుసా?"

"జనం."

"జన మేమిటి?"

"జనం ఎంతకైనా కొనటానికి సిద్ధంగా ఉన్నంతవరకూ వాళ్లు అలాగే అమ్ముతారు."

"వాళ్లెవరు?"

"అమ్మేవాళ్లు."

"అమ్మించేవాళ్ళను."

"పోనీ, అమ్మించేవాళ్లే."

"ఇలా అమ్మించేవాళ్లు-అంటే ఇలా అమ్మటం తప్పని సరి చేసేవాళ్లెవరో తెలుసా?"

"ఏమో."

"నాకు తెలుసు. అందుకే ఉద్యోగం పోయింది."

"ఎవరు?"

"ఈ లైటు ఎక్కణ్ణించి వొస్తోంది?"

"ఎదురు మేడనించి."

"ఆ మహానుభావుడికి రెండువందల ఎకరాలున్నాయి."

"ఉండొచ్చు. దానికీ, మీ ఉద్యోగానికీ సంబంధం ఏమిటి?"

"ఆయనకీ, మా మిల్లు యజమానికీ ఉన్న సంబంధమే."

"వీళ్లు రెడ్లూ, మీ మిల్లు యజమాని వైశ్యుడూగా."

"ఆర్థిక సంబంధం. చుట్టరిక మెవడి క్కావాలి?"

వసంత మాట్లాడకుండా ఊరుకుంది. జరిగిందేమిటో ఇహ రామచంద్రరావు చెప్పకు పోతాడని ఆమెకి తెలుసు.

"మనుషుల మెదళ్లు ఇలా కుళ్లిపోవటానికి కారణమేమిటో నాకు ఆశ్చర్యంగా ఉంది వసంతా. రెండువందల ఎకరాలు గల ఆసామీ తన ధాన్యం నల్లబజార్లో అమ్మాలిసిన అవసరమేమిటి? మనుషులు తిండిలేకుండా చస్తూంటే వాళ్ళ ఆకలితో వర్తకం చేసే ఈ జాతి మనుషుల్ని ఏమనాలి? లక్షలు బ్యాంకులో వేసిన మా మిల్లుయజమానికి దొంగ తిండెందుకు? నిన్న అర్ధరాత్రి మా మిల్లుకి కొన్ని వందల బస్తాల నల్లబజారు వర్తకం తాలూకు ధాన్యం చేరింది. ఇవాళ మధ్యాహ్నం నాకి సంగతి తెలిసింది. అప్పటికే చాలామటుకు ధాన్యం మరవేశారు. కొన్నిబస్తాల బియ్యం మల్లెపూలకంటె తెల్లగా మరపట్టారు. అది చూడగానే నా కనుమానం వేసింది. తోటి గుమాస్తా సుబ్బారావు దగ్గర్నించి అసలు సంగతి తెలుసుకున్నాను. వెంటనే పోలీసు రిపోర్టిచ్చాను. చీకటిపడేదాకా వాళ్లు రాలేదు. ఎనిమిదింటికి వాళ్ళొచ్చి మిల్లు తనిఖీచేస్తే, లెక్కకి ఒక్క బస్తా కూడా కోటాధాన్యం కంటె ఎక్కువ లేదు. ఏమైందో తమాషాగా ఉంది."

"అసలు అది నల్లబజారులో కొన్న ధాన్యమని మీకెలా తెలుసు?"

రామచంద్రరావు నవ్వాడు.

"మా మిల్లులో రెండు సెట్ల పుస్తకాలున్నాయట. ఇవాళదాకా నాకా సంగతి తెలీదు. సుబ్బారావు చెప్పాడు. నిన్నరాత్రి కొన్న ధాన్యం తాలూకు లెక్కలు ఆ పుస్తకాల్లో చూశాను. ఈ మేడగలాయన దగ్గిర్నించే కొన్నారు."

"మరి ఆ బస్తాలన్నీ ఏమయినట్టు?"

"బహుశా దొడ్డిదారి నించి రవాణా ఐఉం

టాయి. కాని ఇలా అకస్మాత్తుగా రవాణా జరగటానికి కారణం నాకు తెలిసింది. మా మిల్లు యజమాని పోలీసులకీ వర్తమానం తెలిసిందని ముందే ఎలాగో పసికట్టాడు."

"సుబ్బారావు చెప్పాడేమో!"

"లేదు. వాడికసలు నేను పోలీసులకి కబురు చేస్తానని తెలీదు. నాటకంలో వాడి పాత్ర కూడా ఉందిలే. కాని ఈ పని పోలీసు స్టేషన్లో ఎవరివల్లో జరిగి ఉండాలి. అలా జరిగిందనటానికి నాకు ఆధారం కూడా ఉంది. కాని అదంతా అనవసరం. ఇక్కడ డబ్బు, మనుషుల్ని గడ్డి తినిపించింది. కర్తవ్యాన్ని విస్మరింపచేసింది. ప్రజల సేవకులైన ఉద్యోగులు వాళ్ల విధ్యుక్త ధర్మం నిర్వర్తించకపోతే ఏం జరుగుతుందో అదేజరిగింది. దొంగలందరూ తప్పించుకున్నారు. తరవాత మిల్లు యజమాని నాకు కబురు చేశాడు. వెళ్ళాను. నన్ను చూడగానే ఆయన మండిపడి ఈ నోట్లు నా ముఖానకొట్టి "విశ్వాస ఘాతకులకిక్కడ స్థానంలేదు. పో" అన్నాడు. నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. అయినా ఈ విషయం ఈయనకెలా తెలిసిందో నాకు ఆశ్చర్యం వేసింది. అంచేత అసలు విషయం తెలిసికోవాలని కొంచెం తమాయించుకుని అన్నాను.

"ఏమిటి మీ అభిప్రాయం?"

"సుబ్బారావు నడుగు, తెలుస్తుంది. ఇంత నమ్మకద్రోహమా?"

"ద్రోహం ఎవరు చేశారో తెలుస్తూనే ఉంది. మీవంటి ప్రజా ద్రోహులు, ఆత్మద్రోహులు, దేశద్రోహులు మరొకర్ని 'ద్రోహి' అని పిలిచే అధికారం ఎప్పుడో పోగొట్టుకున్నారు. దేశద్రోహులక్రింద నేను ఉద్యోగం చెయ్యను." అని విసురుగా వొచ్చేశాను. ఆ మిల్లులో ఉద్యోగం పోయినందుకు నాకేమీ విచారంలేదు. కాని ఏ పరిస్థితుల్లో, ఎవరివల్ల ఉద్యోగం పోయిందో ఆలోచిస్తుంటే నాకు విచారం వేస్తోంది. సుబ్బారావు ఇంతటి స్వార్థపరుడనీ, ఇతరుల కష్టనష్టాలతో తన సౌఖ్యం సంపాదించుకొంటాడనీ నేనెప్పుడూ అనుకోలేదు. ఈ పని చెయ్యటంవల్ల అతనికి కొన్ని రూపాయలు దొరకవచ్చు. యజమాని విశ్వాసం చూరగొనవచ్చు. అందువల్ల మరికొంత డబ్బు సంపాదించుకోవచ్చు. కాని దుర్లభమైన నీతి వర్తనని అతడు క్షణంలో పరిత్యజించాడు. నల్లబజారు వర్తకులతో, లంచగొండులతో చేతులుకలిపి ఏం సంపాదిస్తేమాత్రం అదెంత కాలం వొస్తుంది? ఒకవేళ నిలిచినా దానివల్ల అతనికి కలిగే ఆత్మతృప్తి ఏమిటి?"

వసంత అతని మాటలకి అడ్డు ఒచ్చింది.

"నీతి మాటలు మాట్లాడేవాళ్లు ఒక సంగతి మర్చిపోతారు. 'శరీర మాద్యంఖలు ధర్మసాధనం' అని, తిండిలేకపోతే శరీర మెక్కడ నిలుస్తుంది? నీతి అని కూచుంటే తిండెక్కణ్ణించి వొస్తుంది.

"కాని నాలుగు మెతుకులకోసం ఆత్మని చంపుకొంటావా వసంతా?" జాలిగా అన్నాడు రామచంద్రరావు. ఆ అడిగిన వైఖరి చూసి వసంత కళ్ళలో నీళ్లు తిరిగాయి. గద్గదికంగా అంది.

"అనను. కాని దేశమంతా అన్యాయం నిండి ఉంది. నీతిగా బతికే నలుగురూ కడుపు మాడ్చుకుని ఉపవాసాలు చేస్తుంటే, వాళ్ళ కడుపులు కొట్టే నల్లబజారు వర్తకులూ, లంచగొండులూ, స్వార్థపరులూ ఇహ మూడు పువ్వులూ ఆరుకాయలుగా ఎల్లకాలం వర్ధిల్లాలిసిందేనా?"

రామచంద్రరావు బరువుగా నిట్టూర్చి, కిటికీలోంచి శూన్యంలోకి చూశాడు. విద్యుద్దీప కాంతిలో బాదంచెట్టు ఆకులు మిలమిల మెరుస్తున్నాయి. ఇంతలో గాలి వీచింది. బాదం ఆకులు కొన్ని రాలిపోతున్నాయి. సాలోచనగా ఆ రాలిపోయే ఆకులవైపు చూశాడు రామచంద్రరావు. అతనిలో ఏదో చైతన్యం కలిగింది. పెదవులమీద చిరునవ్వు అంకురించింది.

"లేదు, వసంతా అలా ఎప్పుడూ జరగదు. దుమ్ముకొట్టి, బూజుపట్టి, భూమిసారం పీల్చి, ముదిరి, పీడపట్టిన ఆకులు రాలకతప్పదు. ఎండి సారవిహీనమైన ఆకులు ఎప్పుడో గాలిపోతాయి. పనికిరాని పాడు ఆకులు రాలే కాలం సమీపించింది, వసంతా. అలా చూడు ఆ రాలే ఆకులు చూశావా, అంతే!"